క్లుప్తంగా

వీల్‌చైర్ లేక అవస్థ



దివ్యాంగుడిని మోసుకొస్తున్న దృశ్యం

సుజాతనగర్: ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను కలిసేందుకు వచ్చే దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలకు ఏదైనా అంశంపై దరఖాస్తు ఇచ్చేందుకు దివ్యాంగులు వచ్చిపోతున్నారు. వారి కోసం కనీస సదుపాయాలు లేకపోవడంతో కుర్చీలో కూర్చున్న దివ్యాంగుడిని అలానే మోసుకొని అధికారుల వద్దకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దళితబంధు దరఖాస్తును ఇచ్చేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ఓ దివ్యాంగుడిని కుర్చీలో కూర్చోబెట్టి మోసుకుంటూ వస్తున్న దృశ్యం సోమవారం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

కొత్తూరులో వైద్యశిబిరం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీ కొత్తూరు గ్రామంలో యూనాని వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. యూనాని డాక్టర్ సుగుప్త అక్కడికి వచ్చినవారికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మంగ తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 13 రోజులుగా సమ్మె చేస్తున్నా స్పందించడం లేదని నిరసిస్తూ రెండో ఏఎన్ఎంలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు కంచర్ల జమలయ్య, వేల్పుల మల్లికార్జున్, ఏఎన్ఎంల యూనియన్ నాయకులు సజ్జుబేగం, కార్యదర్శి ప్రియాంక, నాయకులు అరుణ, పార్వతి, సుమలత, పుష్ప, రాములమ్మ, సంధ్యారాణి, వీరమ్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి జీఎం ఎస్.దామోదర్‌రావును మాలమహానాడు, టీబీజీకేఎస్ కార్మికులు సోమవారం సెంట్రల్ వర్క్‌షాప్‌లోని జీఎం కార్యాలయంలో సన్మానించారు. టీబీజీకేఎస్ కార్పొరేట్ బ్రాంచ్ సెక్రటరీ జె.శ్రీనివాస్, మాలమహానాడు రాష్ట్ర నాయకులు ఎస్.మధుసూదన్‌రావు మాట్లాడుతూ సింగరేణిలోని ఎన్నో విభాగాల్లో పనిచేసిన అనుభవంతో మంచి అధికారిగా పేరు గడించారన్నారు. కార్యక్రమంలో జాన్సన్ సుధాకర్, కూరపాటి రవీందర్, సుదర్శన్, నాగేందర్, గంధం సతీశ్, సబ్బరపు కృష్ణ, సుభాష్ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

ఇల్లెందురూరల్: బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో అసువులుబాసిన అమరులకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని సీఎస్పీబస్తీ గ్రామ పంచాయతీ దేవులపల్లి యాకయ్యనగర్‌లో సోమవారం ఏర్పాటైన సభలో సీపీఎం నేత అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. 23 ఏళ్ల కిందట అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రపంచ బ్యాంకు షరతులతో విద్యుత్ చార్జీలు పెంచడంపై ప్రజలు తిరుగుబాటు చేశారని, ఈ ఉద్యమంలో ముగ్గురు అమరులయ్యారని, మరి కొందరు గాయపడ్డారని వివరించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, రాందాస్, వీరభద్రం, రాజు, హుస్సేన్, పాషా, భీముడు, సుజాత, కోటమ్మ, లక్ష్మి, నీలారాణి, సుమన్, వెంకటేశ్వర్లు, సురేశ్, స్రవంతి పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలని ఐటీడీఏ పీఓకు వినతి

పాల్వంచరూరల్: మండలంలోని బంధ్రుగొండ జీపీ పరిధి వలస ఆదివాసీ గిరిజనులు నివాసముంటున్న కొయ్యగుట్ట గ్రామంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ పద్మ, ప్రజాపంథా నాయకుడు నిమ్మల రాంబాబు కోరారు. ఈ సందర్భంగా సోమవారం భద్రాచలంలో ఐటీడీఏ పీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 25 ఏళ్లుగా 50 కుటుంబాలు నివాసం ఉంటుండగా, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేవని చెప్పారు. ఇకనైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు చేయించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్థానికులు మడకం భద్రయ్య, పొడియం వెంకటేశ్, పద్ద భద్రయ్య, జోగారావు, పద్దం లక్ష్మయ్య, రాములు పాల్గొన్నారు.

పల్లెలకు బస్సు వస్తుందా?

- కొత్త రూట్లలో సర్వీసులు నడుస్తాయా?
- బీటీ రోడ్లు ఉన్నా బస్సులు ఎరగని గ్రామాలెన్నో..
- ఇల్లెందు డిపో ప్రారంభంతో ప్రజల్లో ఆశలు
- 24 బస్సుల కేటాయింపుతో కొత్త రూట్లకు నడుస్తాయనే భావన



మాణిక్యారం - కోటగడ్డ మధ్య పాకాల వైపునకు బీటీ రోడ్డు

ఇల్లెందు: రాష్ట్రంలో ప్రతీ పల్లెకు బస్సు సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించి పదేళ్లు కావస్తున్నా చాలా పల్లెలకు బస్సులు ఇంకా వెళ్లలేదు. ఇల్లెందు సబ్ డివిజన్ పరిధిలోని పలు పల్లెలకు ఎర్ర బస్సులు ఎరుగని పరిస్థితి నేటికీ ఉంది. బస్సులు వెళ్లివచ్చేలా పక్కా రోడ్లు ఉన్నా ఆ రహదారుల్లో బస్సులు తిరగక.. ప్రజలు ప్రైవేట్ వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇన్నాళ్లు ఇల్లెందులో డిపో లేదని సరిపెట్టుకున్నా.. ఇప్పుడు డిపో ప్రారంభమైన దృష్ట్యా అధికారులు రహదారి సౌకర్యం ఉన్న గ్రామాలకు బస్సులు నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.కోట్ల వ్యయంతో పక్కా రహదారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలకు రూ.కోట్లు వెచ్చించి పలు పథకాల కింద పక్కా రహదారులను నిర్మించాయి. ఇలాంటి గ్రామాలకు సైతం సక్రమంగా బస్సులను నడపటంలో ఆర్‌టీసీ అధికారులు దృష్టి సారించటం లేదు. ఒకవేళ బస్సులు నడిచినా సమయపాలన పాటించకపోవటం వల్ల ప్రయాణికులు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇల్లెందు మండలంలోని చల్లసముద్రం పంచాయతీలో ధనియాలపాడు గ్రామం వరకు పక్కా రోడ్డు సౌకర్యం ఉంది. మాణిక్యారం - కొమరారం గ్రామాలకూ రోడ్డు వేశారు. గతంలో ఈ రహదారి వెంట బస్సులు తిరిగాయి. ఎల్లన్ననగర్‌కు కూడా గతంలో కొత్తగూడెం డిపో బస్సు తిరిగింది. మాణిక్యారం వరకు ఇల్లెందు నుంచి ఆర్‌టీసీ బస్సులు తిరిగాయి. ఆ తర్వాత ఎందుకో కానీ రద్దు చేశారు. ఇక ఇల్లెందు - ధర్మాపురం, టేకులపల్లి - బోడు - ఇల్లెందు - మర్రిగూడెంతో పాటు ఇల్లెందు - ఉసిరికాయలపల్లికి బీటీ రోడ్డు ఉంది. ఈ మార్గంలో కోటమైసమ్మ దేవాలయం కూడా ఉండడంతో నిత్యం భక్తులు వచ్చివెళ్తుంటారు. ఇక ఇల్లెందు - రేలకాయలపల్లికి పక్కా రహదారి ఉంది. కారేపల్లి మండలంలో గేట్ కారేపల్లి, మేకల తండా మీదుగా డోర్నకల్‌కు గతంలో బస్సులు తిరిగేవి. ఇటీవల కాలంలో రద్దు చేశారు. కామేపల్లి వయా ఊట్కూరు మీదుగా ఖమ్మానికి బస్ సర్వీసులు రద్దు చేశారు. ఈ రూట్లలో బస్సులు నడిపితే ప్రయాణికుల ఆదరణ లభించే అవకాశమున్నందున అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

బస్ డిపో ప్రారంభంతో ఆశలు

ఇల్లెందులో బస్ డిపోను సోమవారం ప్రారంభించారు. దీంతో నూతన రూట్లకు బస్సులు నడిపే అవకాశముందని ప్రజలు ఆశ పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలోని 2.75 ఎకరాల స్థలంలో రూ.3.75 కోట్ల (డీఎంఎఫ్) నిధులతో డిపో ఏర్పాటు చేశారు. ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, ఆళ్లపల్లి, కారేపల్లి మండలాల పరిధిలో ఈ బస్ డిపో ఏర్పాటైంది. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ డిపోల నుంచి 24 బస్సులను కూడా కేటాయించిన నేపథ్యాన కొత్త రూట్లలో బస్సులు నడిపిస్తే డిపో ప్రారంభంతో లాభం జరిగినట్లవుతుంది.

మినీ బస్సు నడిపితే ఉపయోగం..



గత ఏడాది ధర్మాపురానికి కొన్నాళ్లు బస్సు నడిపి రద్దు చేశారు. సుదిమళ్ల, హనుమంతులపాడు, కొత్తూరు, పూబెల్లి, దండగుండాల, ధర్మాపురం వరకు బీటీ రోడ్డు ఉన్నందున మినీ బస్సు నడిపితే ఉపయోగం ఉంటుంది. దీనిపై అధికారులు స్పందించాలి.

–మూతి వెంకటనర్సు, పూబెల్లి సర్పంచ్, ఇల్లెందు మండలం

కొత్త రూట్లపై పరిశీలిస్తున్నాం..



ఏయే రూట్లలో బస్సులు అవసరం, ప్రయాణికుల ఆదరణ ఉంటుందనే అంశంపై పరిశీలన జరుగుతోంది. ఆదాయం వచ్చే మార్గాలను పరిశీలించి బస్సులు నడిపే అవకాశం ఉంది. ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లకుండా ఆర్టీసీ బస్సులను ఆదరించాలి.

–బి.వెంకటేశ్వరరావు, డిపో మేనేజర్, కొత్తగూడెం డిపో

ముంపు బాధితుల నిరసన



ధర్నా చేస్తున్న ముంపు ప్రాంత బాధితులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): చర్ల మండలం గోదావరి పరివాహక ప్రాంతాలైన గుంపునగూడెం, కేశవాపురం, కొత్తపల్లి, ఆనందకాలనీ, లింగాపురం గ్రామాల ప్రజలు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. గోదావరి వరదలు వచ్చిన ప్రతిసారి ఎత్తయిన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీలు ఇస్తారని తరువాత పట్టించుకునే వారే ఉండడం లేదని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం చర్ల మండల కేంద్రంలో ఉన్న 117 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో తాము తుప్ప లు తొలగించి ఇళ్లు నిర్మించుకున్నామని, ప్రభుత్వం పరిశీలించి బాధిత కుటుంబానికి ఐదుసెంట్ల చొప్పున స్థలం కేటాయించి గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పొడుపుగంట సమ్మక్క, మచ్చ వెంకటేశ్వర్లు, మచ్చా రామారావు, శ్యామల వెంకట్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

పాల్వంచ: విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని నవభారత్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి అన్నారు. నవభారత్ పాఠశాల ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'వాల్ ఆఫ్ హ్యుమానిటీ' కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుంచి బియ్యం, కందిపప్పు, సబ్బులు, బట్టలు, బిస్కెట్లు, పండ్లు సేకరించారు. వాటిని సోమవారం జిల్లాలోని జ్యోతి, స్నేహ వృద్ధాశ్రమాలు, సత్య సేవా సమితి, యువసేన ఆశ్రమాల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, పలు విభాగాల ఇన్‌చార్జ్‌లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

షీటీంపై విద్యార్థులకు అవగాహన



షీటీం వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: పాతకొత్తగూడెంలోని హైస్కూల్ విద్యార్థులకు షీటీంపై సోమవారం అవగాహన కల్పించారు. షీటీం ఎస్‌ఐలు రమాదేవి, శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మైనర్లకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చదువు మధ్యలో ఆపి బాలకార్మికులుగా మారొద్దని సూచించారు. సైబర్ నేరాలు అనేకం జరుగుతున్నాయని, సెల్ ఫోన్లకు వచ్చే లింక్‌లకు స్పందించవద్దని, తెలియని వారు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగినా చెప్పొద్దని వివరించారు. ఈ సందర్భంగా షీటీంకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

టేకులపల్లి: మండలంలోని గంగారం పంచాయతీ ఆఫీస్ వెనుక భాగంలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మేక మృతి చెందింది. చర్లపల్లి గ్రామానికి చెందిన పాయం రామయ్యకు చెందిన మేక మృతి చెందడంతో తనను ఆదుకోవాలని ఆయన కోరాడు. కాగా, సంపత్‌నగర్ నుంచి చర్లపల్లి మార్గంలో విద్యుత్ షాక్‌కు గురై మూగజీవితాలు తరచుగా మృత్యువాత పడుతున్నందున అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని సర్పంచ్ పాయం సమ్మయ్య కోరారు.

31 నుంచి ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమ్మె

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 31 నుంచి స్వీపర్ నుంచి స్టాఫ్ నర్సు వరకు సమ్మెబాట పడతామని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేశ్‌ఖన్నా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్న సిబ్బందికి వేతనాలు పెంచకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, వి.మల్లికార్జున్, సునీత, వి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాస్, పావని, ఆజ్మద్, ఎం.సంగీత, పి.ప్రశాంత్, కె.సౌందర్య పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బీఎస్పీతోనే బహుజనుల జీవితాల్లో వెలుగులు

చుంచుపల్లి: బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల జీవితాలు బాగుపడతాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ అన్నారు. ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చుంచుపల్లి తండాలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కామేశ్ మాట్లాడుతూ అగ్రవర్ణ పార్టీలు, నాయకులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు, మేధావులు బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్రంలో 90 శాతానికి పైగా ఉన్న బహుజనులు అణచివేతకు గురవుతున్నందున, బీఎస్పీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, మాలోత్ వీరునాయక్, భూక్యా శంకర్, భీముడు, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ కిట్స్ పంపిణీ

సుజాతనగర్: చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుజాతనగర్, గరీబ్‌పేట ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు సోమవారం శానిటరీ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, రామవరం అటవీ రేంజ్ అధికారిణి ఉమా మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, నిరుపేదలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యురాలు కవిత, వైద్యాధికారి లత పాల్గొన్నారు.

ప్లేట్లు వితరణ

జూలూరుపాడు: మండలంలోని వెనకతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం దాతలు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు వితరణ చేశారు. ఈ ప్లేట్లు, బాటిళ్లను జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.నరసింహ, ఉపాధ్యాయుడు బి.బాలకిషన్, ఎస్ఎంసీ చైర్మన్ రవి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచ: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఫైర్, సేఫ్టీపై ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాల్వంచలోని టెక్‌షోర్ ఇన్స్పిరేషన్ సర్వీసెస్ ఎండీ దేవబత్తిని కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా దృష్ట్యా ఫైర్, సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. పదో తరగతి లేదా డిగ్రీ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 95733 20215, 94911 09068 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లు అందజేత

పాల్వంచ: పట్టణంలోని న్యూ ఇందిరా ప్రియదర్శిని పాఠశాలలో 2022–23లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను వంగళ ట్రస్ట్ బాధ్యులు పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కె.నాగమణి చేతుల మీదుగా 8 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున అందించారు. ట్రస్ట్ కోఆర్డినేటర్ అబ్దుల్ జలీల్, హెచ్‌ఎం సుమతి పాల్గొన్నారు.

రైతుల్లో భరోసా నింపిన బీజేపీ సభ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన 'రైతు గోస – బీజేపీ భరోసా' సభకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పాల్గొనగా.. ఈ సభ రైతాంగంలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని బీజేపీ నాయకులు వెల్లడించారు. కొత్తగూడెంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీ ఉనికి లేదని చెప్పిన వాళ్లకు ఈ సభ విజయవంతం కావడమే సమాధానమని పేర్కొన్నారు. ప్రజలు, కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రోజువారీ షెడ్యూల్ కొంత ఆలస్యం మూలంగానే భద్రాచలం పర్యటన రద్దయిందే తప్ప, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. ఏదిఏమైనా రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, దేశవ్యాప్తంగా మోదీ ప్రభంజనం కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎడ్లపల్లి శ్రీనివాసరావు, నాయకులు కేవీ రంగాకిరణ్, రమేశ్, ఆకుల నాగేశ్వరరావు, లక్ష్మణ్ అగర్వాల్, రవీందర్, గాంధీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి..



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: అర్హులందరికీ తక్షణమే పట్టాల పంపిణీ పూర్తి చేయాలని కోరుతూ సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కౌన్సిలర్లు, నాయకుల ఆధ్వర్యంలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దరఖాస్తుదారుల విచారణలో ఎన్‌టసీ ఇవ్వాలని, అఫిడవిట్ సమర్పించాలని, అట్లాగే ఇంటిస్థలాల విక్రయదారుల సంతకాలు, వాంగ్మూలం ఇవ్వాలని, వారసత్వ వాటా ఆస్తి అయితే కుటుంబ సభ్యుల ధ్రువీకరణ కావాలనే ఆంక్షలు విధించడం సరికాదన్నారు. కాగా, స్థలాల విక్రయదారుల సంతకాలు, వాంగ్మూలాల నిబంధనలను తొలగిస్తామని, అర్హులందరికీ త్వరలోనే పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ చెప్పారని నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో బోయిన విజయకుమార్, పి.సత్యనారాయణచారి, భూక్య శ్రీనివాస్, గుగులోతు నగేశ్, జహీర్, రవి పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో సమీక్ష



సమీక్షలో పాల్గొన్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం క్యాపిటల్ మెషినరీ ఐటమ్స్‌పై 2024–25 వార్షిక ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. జీఎం (ఐఅండ్‌పీఎం) ఎ.రవికుమార్, వారి సభ్యులు ఏరియాలోని అన్ని డిపార్ట్‌మెంట్ల హెచ్‌ఓడీలతో సమీక్ష చేశారు. ఫండ్స్, అప్రూవల్ ఎలా తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెంరాజు, ఎస్ఓటు జీఎం జీవీ కోటిరెడ్డి, ఏజీఎం (పర్సనల్) పి.శామ్యూల్ సుధాకర్, పీవీకే 5 ఇంక్లయిన్ ఏజెంట్ బి.రవీందర్, ఇన్‌చార్జ్ ఏరియా ఇంజనీర్ వై.వెంకటేశ్వర్లు, రమేశ్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా మాదిరిగా చెల్లించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కోలిండియా మాదిరిగా 11వ వేతన ఒప్పందం 23 నెలల ఎరియర్స్‌ను ఆగస్టు నెల జీతంతో సెప్టెంబర్ 3న చెల్లించాలని జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 20న కోల్‌కతా ఒప్పందం జరిగిన వెంటనే జూన్ నుంచి కొత్త వేతనాలు చెల్లించారని, కోల్ ఇండియా మాదిరిగానే ఆగస్టు నెల జీతంతో పాటు 23 నెలల ఎరియర్స్ చెలించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని, 32,184 కోట్ల లాభం వచ్చిందని ఏప్రిల్ 30న జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో వెల్లడించారని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి టీఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గిరిజన టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



పోస్టుకార్డులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌లో భాగంగా మూడు దశలుగా ఉద్యమాలు చేపడుతున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్‌నాయక్ తెలిపారు. మొదటి దశలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపిస్తుండగా సోమవారం కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు హాస్టల్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.అమర్ సింగ్, టీపీటీఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయులు ఈ.ముత్తయ్య, బి.శ్రీనివాస్, ఎం.శారద, ఈ.పీ.రాజు, బి.బాలరాజు, కె.లాలయ్య, పి.పాపారావు, జె.సామ్య, బి.కస్నానాయక్, సీహెచ్.వీరన్న, సీహెచ్.జానకి, బి.నాగేశ్వరరావు, టి.హరిలాల్, జి.రవి, ఏ.భద్రు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

ఇల్లెందురూరల్: ఇఫ్టూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇఫ్టూ అనుబంధ తెలంగాణ హమాలీ, మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. హమాలీ కార్మికులకు ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో తోడేటి నాగేశ్వరరావు, జటంగి వెంకన్న, తొగర సామేలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సారంగపాణి

పనికొస్తోంది

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ తాపీ కూలీలు, మేస్త్రీలకు అడ్డా. ప్రతీ రోజు ఉదయం 7 గంటలకు మేస్త్రీలు, కూలీలు పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకుంటారు. పనుల కోసం ఉదయం 10 గంటల వరకు వేచి చూస్తుంటారు. ఆ ఏరియాలో ఉన్న ట్రాఫిక్ ఐలాండ్‌లో సోమవారం కొందరు కూలీలు ఉదయం నిల్చొని పనుల కోసం ఎదురుచూశారు. ఈ ఐలాండ్‌లో పోలీసులు లేకున్నా కూలీలకైనా ఉపయోగపడుతోందని పలువురు చర్చించుకుంటున్నారు.

–కొత్తగూడెంఅర్బన్

